సాక్షి తిరుపతి

గురువారం । 14 । డిసెంబర్ । 2023



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.



విజయవంతంగా 'డ్రైవింగ్'

తిరుపతిలోని అలిపిరి డ్రైవింగ్ స్కూల్ విజయవంతంగా మూడేళ్లు పూర్తి చేసుకుంది. - IIలో



సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. - IIలో

శుభస్వాగతం.. సాదర వీడ్కోలు

- తిరుపతికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆత్మీయ ఆహ్వానం పలికిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు సంజీవయ్య, ఆదిమూలం, ఎమ్మెల్సీలు సుబ్రమణ్యం, మురళీధర్, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, ఎన్‌డీడీసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

రేణిగుంట : తిరుపతిలో ఓ శుభ కార్యానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేశారు. బుధవారం సాయంత్రం 4.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వెంట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వచ్చారు. ముఖ్యమంత్రికి ఎయిర్‌పోర్టులో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, మేడా మల్లికార్జున రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, మేరిగ మురళీధర్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, చిత్తూరు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దేశాయి తిప్పారెడ్డి, సునీల్‌కుమార్, తిరుపతి నగర కమిషనర్ హరిత, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి, ఆర్‌డీఓ రవిశంకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. తిరుపతి పర్యటన అనంతరం 5.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరారు. ఆయనకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సాదరంగా వీడ్కోలు పలికారు.

న్యూస్‌రీల్

24న అన్నమయ్య కీర్తనల పోటీలు

తిరుపతి కల్చరల్ : అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన తిరుపతి మహతి కళాక్షేత్రంలో అన్నమయ్య కీర్తనల గాత్ర పోటీలు నిర్వహించనున్నట్లు ఆటా వేడుకల చైర్మన్ జయంత్ చల్లా, అధ్యక్షుడు మధు బొమ్మినేని తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో 12 నుంచి 25 ఏళ్లలోపు బాలబాలికలు, యువతీ యువకులకు వేర్వేరుగా పోటీలు ఉంటాయని వివరించారు. ఆసక్తిగలవారు 20వ తేదీలోపు ఏదైనా ఒక అన్నమయ్య కీర్తనను ఆలపించి ఆడియోను 88852 73256 నంబర్‌కు పంపించాలని కోరారు. విజేతలకు సర్టిఫికెట్‌తోపాటు నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

ఉపాధి పనుల పరిశీలన



రోజా తోటను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

రామచంద్రాపురం: మండలంలోని సి.రామాపురం, మిట్టకండ్రిగ, రాయలచెరువు పంచాయతీల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను విజయవాడ ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనులతోపాటు అదనపు ఆదాయం కోసం ఎలాంటి పనులు చేస్తున్నారని ఆరా తీశారు. పశుపోషణ, గొర్రెల పెంపకం, వ్యవసాయ పనులు, కూరగాయలు పండిస్తున్నామని కూలీలు వివరించారు. అనంతరం రాయలచెరువులో నాదముని అనే రైతు సాగు చేస్తున్న రోజా తోటను సందర్శించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఏపీడీ పద్మలత, ప్లాంటేషన్ మేనేజర్ అనిల్, సూపర్‌వైజర్ ప్రమీల, ఏపీఓ హంసవేణి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపల్‌గా నిరంజన్‌బాబు



నిరంజన్‌బాబుకు అవార్డు అందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ రంగ జనార్దన్

రామచంద్రాపురం: మండలంలోని వెంట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్‌బాబును జేఎన్‌టీయూ అనంతపురం వారు ఉత్తమ ప్రిన్సిపల్‌గా ఎంపిక చేశారు. బుధవారం ఈ మేరకు కరస్పాండెంట్ సుమలత మాట్లాడుతూ నిరంజన్‌బాబుతోపాటు ఉత్తమ అధ్యాపకుడిగా శరవణకుమార్‌కు జేఎన్‌టీయూ వీసీ రంగ జనార్దన, రిజిస్ట్రార్ శశిధర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అవార్డు అందించినట్లు వివరించారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఈఓ రామారావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని హుండీల లెక్కింపును బుధవారం చేపట్టారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద హుండీల ద్వారా రూ.2,16,47,877 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. నవంబర్ 8వ తేదీ నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు. లెక్కింపును ఈఓ కేఎస్ రామారావు పర్యవేక్షించారు.

14,15 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కార్వేటినగరం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ నెల 14,15 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపిక చేసిన 136 పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 14వ తేదీన 68 పాఠశాలలకు, 15వ తేదీన 68 పాఠశాలల హెచ్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు ఎంపిక చేసిన ప్రతి ఒక్క రూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర వివరాలకు 9440757761 నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ కోరారు.

జగనన్నతోనే భవిత..

కదం తొక్కిన యువత





తిరుపతిలో ఎమ్మార్‌పల్లె సర్కిల్ నుంచి అన్నమయ్య కూడలి వరకు నిర్వహించిన ర్యాలీకి పెద్దసంఖ్యలో హాజరైన విద్యార్థులు (ఇన్‌సెట్) విద్యార్థి సంఘాల నేతలు

- తిరుపతిలో విద్యార్థుల భారీ ర్యాలీ
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన తిరునగరి
- ప్రతిపక్షాలకు పుట్టగతులుండవన్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

"విద్యారంగం అభివృద్ధికి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారు.. పేద పిల్లల ఉన్నత భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారు.. ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారు.. లక్షలాది ఉద్యోగాలతో యువతకు ఉపాధి కల్పించారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం నడుస్తున్నారు. ఆయనకు మద్దతుగా వేలాది మంది విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. జగనన్నతోనే భవిత అంటూ కదం తొక్కారు'' అని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు వెల్లడించారు. బుధవారం తిరుపతిలో నిర్వహించిన భారీ ర్యాలీని ఉద్దేశించి వారు మాట్లాడారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామంటూ పిలుపునిచ్చారు.

తిరుపతి సిటీ : ఏపీకి మళ్లీ జగనన్నే సీఎం కావాలంటూ విద్యార్థిలోకం కదం తొక్కింది. బుధవారం తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం వరకు సుమారు 7వేల మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పి.చైతన్య ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా విద్యార్థులు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబును ప్రజలు విశ్వసించరని వెల్లడించారు. పేద పిల్లలకు అండగా నిలబడి అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అందిస్తున్న జగనన్నకు ప్రజలు బ్రహ్మరథం పట్టనున్నారని తెలిపారు. విద్య, వైద్యరంగాలలో దేశంలోనే ఏపీని నంబర్‌వన్ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. విద్యార్థులు కన్నెర్ర చేస్తే టీడీపీ, జనసేనకు పుట్టగతులుండవని స్పష్టం చేశారు. పవన్, లోకేష్ అవగాహన లేమితో, రాజకీయ పరిపక్వత లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నాలుగున్నరేళ్లలో సుమారు 2.14లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం చారిత్రక విషయమన్నారు. పేద విద్యార్థులు పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడేందుకు సీబీఎస్ఈ, టోఫెల్, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం తథ్యమని వెల్లడించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీలో విద్యార్థి విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ లెక్కల రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మణికంత, అశోక్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, కేథర్, యశ్వంత్, పవన్, విరుపాక్ష, సెంథిల్ కుమార్, అయ్యప్ప, ముబారక్, మహేంద్రనాయక్, వంశీ, వెంకటేష్ పాల్గొన్నారు.

మెదడు శస్త్ర చికిత్సలో 'న్యూరో' కీలకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి తుడా : మెదడు శస్త్ర చికిత్సలో న్యూరో సర్జన్ పాత్ర కీలకమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ వెల్లడించారు. బుధవారం శ్రీపద్మావతి వైద్య కళాశాలలో స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగం వారు చెరుకూరి నరసింహ, సుభద్రాదేవి 9వ వార్షిక చైర్ ఒరేషన్ కార్యక్రమం నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ అనూరిజం క్లిప్పింగ్ అనేది ఒక రకమైన మైక్రోసర్జరీ అని, దీనిలో మెదడులోని అనూరిజం మూసివేయడానికి మెటల్ సర్జికల్ క్లిప్ ఉపయోగించడం జరుగుతుందన్నారు. వివరణాత్మక శస్త్ర చికిత్సా విధానాలను నిర్వహించడానికి ఆపరేటింగ్ మైక్రోస్కోప్ వంటి చిన్న పరికరాలను ఉపయోగిస్తారని తెలిపారు. నరాలు, రక్తనాళాలు, మెదడు కణజాలానికి హాని కలిగించకుండా ఉండటానికి సూక్ష్మ శస్త్రచికిత్స సమయంలో కచ్చితత్వం కీలకమని వివరించారు. కార్యకమరంలో స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ అరవింద్ కుమార్ దూబే, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ వెంకట్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సరళ పాల్గొన్నారు.

పెళ్లి మండపంలో మృత్యుఘోష!

- ఫ్లవర్ స్ప్రే సిలిండర్ పేలి బాలిక మృతి



హృదయవిదారకంగా ఘటనా స్థలం

పుత్తూరు: మంగళ వాయిద్యాలు, బంధువుల హడావుడితో కళకళలాడుతున్న కల్యాణ మండపంలో ఒక్కసారిగా పెద్దగా పేలుడు. దీంతో ఒక్కసారిగా కల్యాణమండపంలో భయానక వాతావరణం.. ఏమి జరిగిందో తెలుసుకొనేలోపు ఓ బాలిక రక్తపుమడుగులో కనిపించింది. దీంతో కల్యాణమండపం మొత్తం ఒక్కసారిగా ఏడుపులు పెడబొబ్బలతో దద్దరిల్లిపోయింది. ఈ భయానక బీభత్స సంఘటన బుధవారం రాత్రి పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంలోని జీవీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగింది. పుత్తూరు మండలం దిగువ కృష్ణసముద్రం గ్రామానికి చెందిన పీడీ గుణశేఖర్ నారాయణవనం మండలం కళిమిట్టలో నివాసం ఉంటున్నాడు. తన భార్య మీనాకు దగ్గర బంధువు వివాహానికి తన కుమార్తె చాందిని(14)తో కలిసి ముగ్గురూ వచ్చారు. పెళ్లి సందడిలో ఫ్లవర్ ఎక్స్‌పోజర్ మిషన్‌కు అమర్చిన సిలిండర్ పేలడంతో పక్కనే ఉన్న చాందిని తలకు బలమైన గాయం అయ్యింది. దీంతో చాందినీని వెంటనే పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చాందిని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా మృతురాలు నారాయణవనం బాలి కల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం పోసేలా భరోసా!

ప్రజారోగ్య రక్షణే పరమావధిగా భావించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మానవత్వం చాటుకున్నారు. రెండు కిడ్నీలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. చికిత్స నిమిత్తం మొత్తం ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదల చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం ఆగమేఘాల మీద స్పందించింది. బాధితుడిని మంగళవారం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించింది. ఐసీయూ అడ్మిట్ చేయించి ట్రీట్‌మెంట్ అందిస్తోంది.

- కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి అభయమిచ్చిన సీఎం వైఎస్ జగన్
- అవయవ మార్పిడికి ఆదేశం
- స్విమ్స్‌లో బాధితుడికి మెరుగైన వైద్యం

తిరుపతి తుడా : తుపాను బాధితులను పరామర్శించేందుకు ఈ నెల 8వ తేదీన వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామానికి చెందిన పాలురి మురళీ గోపాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి ముఖ్యమంత్రి దృష్టికి తన ఆరోగ్య పరిస్థితిని తీసుకెళ్లారు. రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతినడంతో వారానికి మూడు రోజులు డయాలసిస్ చేయించుకుంటున్నానని తన గోడు వెళ్లబోసుకున్నారు. రెండేళ్లుగా చికిత్స చేయించుకోవడం తమ కుటుంబానికి భారంగా మారిందని తెలిపారు. ఇందుకోసం ఆస్తులన్నీ అమ్మేసుకున్నామని, ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నామని వివరించారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి వెంటనే స్పందించారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. మురళీ గోపాలకృష్ణకు వెంటనే చికిత్స చేయించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరిని ఆదేశించారు. ఈక్రమంలో బాధితుడిని మంగళవారం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. నెఫ్రాలజీ ఐసీయూ విభాగంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ పర్యవేక్షణలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. కిడ్నీలు రెండూ పూర్తిగా చెడిపోయిన విషయాన్ని గుర్తించారు. బాధితుడికి కిడ్నీ మార్పిడి అనివార్యమని తేల్చారు. ఇందుకోసం అవయవదాన్‌లో బాధితుడి పేరు సైతం నమోదు చేయించారు.



కిడ్నీ బాధితుడితో స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్, డీఎంహెచ్‌ఓ శ్రీహరి

కిడ్నీ మార్పిడికి చర్యలు



ముఖ్యమంత్రి ఆదేశాలతో బాధితుడికి స్విమ్స్‌లో వైద్య చికిత్సలు చేయిస్తున్నాం. రెండు కిడ్నీల మార్పిడి అనివార్యం కావడంతో అవయవదాన్‌లో పేరు నమోదు చేయించాం. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. దాతలు ముందుకొస్తే కిడ్నీల మార్పిడికి అన్ని చర్యలు తీసుకుంటాం. స్విమ్స్ వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

– డాక్టర్ శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

జగనన్నకు రుణపడి ఉంటాం

మేమందరం మొదటి నుంచి వైఎస్ కుటుంబానికి వీరాభిమానులం. తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన నా తండ్రికి పునర్జన్మను ప్రసాదించేందుకు సాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయిం సంతోషంగా ఉంది. వైద్యం కోసం అడిగిన వెంటనే పెద్ద మనసుతో ముందుకొచ్చి మానవత్వం చాటుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– దశరథరామిరెడ్డి, బాధితుడి కుమారుడు

క్లుప్తంగా

స్పీడ్ స్కేటింగ్‌లో 'డాక్టర్ కిషోర్స్ రత్నం' విద్యార్థి ప్రతిభ



కమలేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో ఉన్న డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల 5వ తరగతి విద్యార్థి జె.కమలేష్ యాదవ్ స్పీడ్ స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో అండర్–14 విభాగం నుంచి పాల్గొన్నాడు. 200 మీటర్లు, 400 మీటర్లు, వెయ్యిమీటర్లు, వంద మీటర్ల రిలే గ్రూప్‌లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. . జనవరి 27, 28వ తేదీలలో కోయంబత్తూరులో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం ఈ మేరకు కమలేష్‌ను పాఠశాల డైరెక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, ప్రిన్సిపల్ కుమార్ అభినందించారు.

లైంగిక వేధింపులపై పోక్సో కేసు

చంద్రగిరి : బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు మైనర్లతో పాటు ఓ యువకుడిపై పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. వివరాలు.. చంద్రగిరికి చెందిన బాలిక ఈ నెల 8వ తేదీన అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాలికతో పాటు ఇద్దరు మైనర్ బాలురు, ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికపై లైగింక వేధింపులకు పాల్పడినట్టు గుర్తించిన పోలీసులు పోక్సో యాక్ట్ కిందకు మార్చి నమోదు చేశారు.

ఆత్మహత్య కేసులో ఆరుగురికి రిమాండ్

నాగలాపురం: మండలంలోని పశ్చిమ దళితవాడకు చెందిన నిషా(23) అనే వివాహిత కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో నిషా భర్తతోపాటు కుటుంబీకులు కాలియమ్మ, మెరీనా, దేవేంద్రన్, అకిష, సబితను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్ నిమిత్తం నిందితులను తిరుపతి సబ్‌జైలుకు తరలించారు.

విజయవంతంగా 'డ్రైవింగ్'

- అలిపిరిలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కు మూడేళ్లు
- 23 బ్యాచ్‌ల్లో 368 మందికి శిక్షణ
- కొనసాగుతున్న 24వ బ్యాచ్ ట్రైనింగ్
- 25వ బ్యాచ్‌కు దరఖాస్తుల స్వీకరణ



డ్రైవింగ్ స్కూల్‌లో అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారులు



సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీలో విప్లవాత్మకమైన మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ముందుగా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి వేలాది మంది ఉద్యోగుల కల సాకారం చేశారు. అలాగే ఆర్టీసీ అభివృద్ధికి వినూత్న సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక్కో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు తక్కువ ఫీజుతో ఉత్తమ ట్రైనింగ్ అందించి.. హెవీ లైసెన్స్‌లు పొందేలా చర్యలు తీసుకున్నారు. వాహనం నడపడమే కాకుండా మెకానిజంపై కూడా శిక్షణ ఇస్తుండడంతో ఇక్కడ చేరేందుకు అంతా ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో తిరుపతిలోని అలిపిరి వద్ద నెలకొల్పిన డ్రైవింగ్ స్కూల్‌కు ఎక్కువ మంది బారులు తీరుతున్నారు. గత మూడేళ్లుగా ఉత్తమ డ్రైవర్లను అందిస్తూ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచినందుకు అధికారులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు.

నామమాత్రపు ఖర్చులే..!

హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ప్రైవేటు శిక్షణ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం నామమాత్రపు ఖర్చులతో శిక్షణ ఇస్తోంది. డ్రైవింగ్‌తోపాటు మెకానిజంపై శిక్షణ ఇస్తుంది. మరమ్మతులు వారే చేసేలా ట్రెనింగ్ ఇప్పిస్తోంది. దీంతో డ్రైవింగ్ స్కూల్‌లో చేరడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

రాష్ట్రంలో రెండో స్థానం

రాష్ట్రంలో ఆర్టీసీ అలిపిరి డ్రైవింగ్ స్కూల్ రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో అన్నమయ్య జిల్లా ఉంది. ఇప్పటి వరకు 23 బ్యాచ్‌ల్లో 368 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేశారు. 24వ బ్యాచ్ శిక్షణ కొనసాగుతుంది. కొత్త సంవత్సరంలో 25వ బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శిక్షణ పొందిన 368 మందిలో 100 మందికి స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జిల్లాలోని వివిధ డిపోల్లో పనిచేయడానికి కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్నారు. మరికొందరికి విద్యుత్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేయడానికి అవకాశం కల్పించారు. ఇంకొందరు ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో డ్రైవర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు.

మూడేళ్లు పూర్తి

అలిపిరిలో 2020 నవంబర్‌లో ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. మూడేళ్లగా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా సజావుగా ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ కొనసాగుతోంది.

నాణ్యమైన శిక్షణ



అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో నాణ్యమైన శిక్షణ ఇస్తున్నాం. ఎక్కడైనా ఉద్యోగం చేయడానికి వీలుగా శిక్షణ ఉంటుంది. మరోవైపు మెకానిజంలోను ప్రత్యేక ట్రైనింగ్ అందిస్తున్నాం. మా దగ్గర శిక్షణ పొందిన అనేక మందికి ఆర్టీసీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాం. శిక్షణ పొందుతున్న వారికి మెరుగైన సౌకర్యాలు సైతం కల్పిస్తున్నాం.

– చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తూ..

భాకరాపేట : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. బుధవారం ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లె, చింతగుంట పంచాయతీల్లో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం , వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ ఎరుగని విప్లవాత్మక పాలనకు ముఖ్యమంత్రి జగనన్న శ్రీకారం చుట్టారన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ముఖ్యమంత్రి కావాలని జనం కోరుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వం ద్వారా మంచి జరిగితేనే ఓటేయండి అని కోరిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అని వివరించారు. చిత్తశుద్ధితో ప్రజా సేవ చేయడంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదర్శనీయులని కొనియాడారు. ఆయన దాతృత్వం, సేవాతత్వం స్ఫూర్తిదాయకమని తెలిపారు. కరోనా కష్టకాలంలో,చ ప్రకృతి వైపరీత్యాల్లో భరోసా కల్పించిన నాయకుడిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. తన సంపాదనలో 75 శాతం నియోజక వర్గ ప్రజలకు ఖర్చు చేస్తానని బహిరంగంగా ప్రకటించిన ఏకైక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని వెల్లడించారు. వ్యవసాయ మార్కెట్, వారపు సంతల్లో పదేళ్లపాటు కూరగాయలు వ్యాపారం చేసుకునేందుకు ఎలాంటి గేట్ చెల్లింపులు లేకుండా ఎమ్మెల్యే భాస్కర్‌రెడ్డి చర్యలు చేపట్టారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవలందిస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శివలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెంగల్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, విజయలక్ష్మీ, బాబీ, నాగార్జునరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ఎంపీడీఓ అమర్‌నాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య పాల్గొన్నారు.

రేపు ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పేరొందిన మూడు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు పాల్గొని సుమారు 3వేలకు పైచిలుకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకామ్, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ అర్హత గల నిరుద్యోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తిగల వారు మరిన్ని వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీవీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జేకేసీ, క్వెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిక్సన్(టీవీ మాన్యుఫాక్చరింగ్) అసెంబ్లీ ఆపరేటర్, క్వాలిటీ కంట్రోల్ రోల్, గ్లోబల్ భారత్ హెచ్ఆర్ సొల్యూషన్, వాయిస్ బీపీవో, క్రెడిట్ కార్డ్ సేల్స్, ఫ్లిప్ కార్డ్ డెలివరీ బాయ్స్ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో పాస్ లేదా ఫెయిల్ అయిన వారు 18–30 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులని, ఎంపికైన వారికి రూ.13వేల నుంచి రూ.20వేల వరకు జీతం, అదనపు ప్రయోజనాలు, ఉచిత రవాణా, షిఫ్ట్ సమయంలో ఉచిత ఆహారం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్, పాన్‌కార్డు/ఓటర్ కార్డు (ఒరిజినల్, జెరాక్స్), బయోడేటా రెండు సెట్లు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో శుక్రవారం ఉదయం 10గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు రేణిగుంట విమానాశ్రయం సమీపంలో, శ్రీకాళహస్తి, ఏర్పేడు, తిరుపతి, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కోసం 9440502338, 7981473129 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కుంగిన కల్వర్టు



శ్రీకాళహస్తి-వరదయ్యపాళెం రోడ్డు మార్గంలో ఎన్టీఆర్‌నగర్ వద్ద కుంగిన కల్వర్టు

- శ్రీకాళహస్తి-వరదయ్యపాళెం ప్రధాన రహదారిలో ఘటన
- స్తంభించిన వాహనాల రాకపోకలు

వరదయ్యపాళెం: శ్రీకాళహస్తి-వరదయ్యపాళెం ప్రధాన రహదారిలో ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు ఒక్కసారిగా కుంగిపోయింది. వరదయ్యపాళెం సమీపంలోని ఎన్టీఆర్‌నగర్ వద్ద బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరగడంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ప్రధానంగా చెన్నైకు అనుసంధానంగా ఉన్న ఈ ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో అటు శ్రీసిటీకి రోజూ వందలాది వాహనాల్లో పరిశ్రమలకు కార్మికులు వెళ్తుంటారు. ఇటు చెన్నై నుంచి శ్రీకాళహస్తి, తిరుపతి ఆలయాలకు, వివిధ అవసరాలకు రోజువారీ వందలాది వాహనాలు ఈ మార్గంలో వెళ్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కసారిగా కల్వర్టు కుంగిపోవడంతో ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన అన్ని రకాల వాహనాల రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాల సమయంలో ఈ ప్రాంతంలో వరద నీరు ఉధృతి ఎక్కువ కావడంతో ఆ సమయంలో ఓవైపు కల్వర్టు వద్ద కోతకు గురైంది. దీంతో 25ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు ఒక్కసారిగా కుంగిపోయినట్లు ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి సబ్ డివిజన్ డీఈ శ్రీనివాసులు, ఏఈ గిరీష్ సంఘటన స్థలానికి చేరుకుని కుంగిన కల్వర్టును పరిశీలించారు. సమాచారాన్ని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు నివేదించారు. కుంగిన కల్వర్టు ప్రాంతంలో గురువారం తాత్కాలికంగా పైపులు వేసి రాకపోకల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు. విపత్తు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ మళ్లింపు

ఎన్టీఆర్‌నగర్ వద్ద కల్వర్టు కుంగడంతో ఆ మార్గంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులు స్పందించి బుచ్చినాయుడుకండ్రిగ చెక్‌పోస్టు వద్ద నుంచి శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనాలను సూళ్లూరుపేట మీదుగా మళ్లించారు. అలాగే వరదయ్యపాళెం మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే వాహనాలను స్థానిక పోలీసుల సహకారంతో సంతవేలూరు వైపుగా మళ్లించారు. ఆర్టీసీ బస్సులు మాత్రం కుంగిన కల్వర్టు వరకు అటు ఇటు వచ్చే ప్రయాణికులను మార్పిడి చేస్తూ ప్రయాణికులను యథావిధిగా రాకపోకలు కొనసాగించాయి.

జనావాసంలోకి కొండచిలువ



కొండచిలువతో ఫారెస్ట్ సిబ్బంది

కేవీబీపురం : మండలంలోని సూర్యనారాయణపురంలోకి బుధవారం సుమారు 10 అడుగుల భారీ కొండ చిలువ చొరబడింది. స్థానికులు పట్టుకునేందుకు యత్నించగా ఇళ్ల సమీపంలోని గడ్డివాములోకి వెళ్లిపోయింది. ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం అందించడంతో స్నేక్ క్యాచర్లు శ్రీకాంత్, భోగయ్య గ్రామానికి చేరుకున్నారు. రెండు గంటలపాటు శ్రమించి కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం పిచ్చాటూరు వద్ద అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు.

బైక్‌కు నిప్పుపెట్టిన దుండగులు



కాలిపోయిన బైక్

చంద్రగిరి : చంద్రగిరి కోట గ్రామంలో మంగళవారం రాత్రి శేఖర్ అనే వ్యక్తి బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఇంటి ముందు పార్క్ చేసిన బజాజ్ పల్సర్ బైక్‌పై దుండగులు పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు బాధితుడు వెల్లడించాడు. బుధవారం దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడు బియ్యం పట్టివేత



సీజ్ చేసిన బియ్యం బస్తాలతో విజిలెన్స్ అధికారులు

సూళ్లూరుపేట : పట్టణంలోని బొగ్గుల కాలనీలో గోవిందమ్మ అనే మహిళ తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 138 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎస్ఐ ఎం.రామకృష్ణనాయక్ బుధవారం సీజ్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ చలువాది రవి అనే వ్యక్తి గోవిందమ్మతో కలిసి బియ్యం నిల్వ చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ గోదాముకు తరలించామన్నారు. సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పుత్తూరు: కూలి పనికి వెళ్లిన ఓ యువకుడు కరెంట్‌షాక్ గురై మృతి చెందిన సంఘటన వడమాలపేటలో చోటు చేసుకొంది. ట్రైనీ డీఎస్పీ సింధూప్రియ కథనం మేరకు.. రేణిగుంట మండలం అన్నాస్వామిపల్లె గ్రామానికి చెందిన ఎం.వెంకయ్య (22) అనే యువకుడు వడమాలపేట టోల్ ప్లాజా సమీపంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ వెంచర్‌లో మంగళవారం కూలి పనికి వెళ్లాడు. సాయంత్రం ఇనుప పైపును తీసుకెళుతుండగా హై ఓల్టేజీ విద్యుత్ లైన్ తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. బుధవారం మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొని ఒకరి మృతి

వి.కోట: టోల్ గేటు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొని ఓ ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని శీకార్లపల్లెకు చెందిన వెంకట రామప్ప కుమారుడు చంద్రప్ప(51) వి.కోట పట్టణం నుంచి రాత్రి సమయంలో తన ద్విచక్రవాహనంలో తిరిగి తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో వి.కోట–పలమనేరు జాతీయరహదారిలోని టోల్ గేటు వద్ద ప్రమాదవశాత్తు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొని, గాయపడ్డాడు. ఈ విషయం గుర్తించిన స్థానికులు క్షతగాత్రుడిని వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చంద్రప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సైదాపురం(వెంకటగిరి) : వెంకటగిరి బస్టాండ్ వద్ద గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. ఒడిశాకు చెందిన బిజయ్‌కుమార్ అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో ఎస్ఈబీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.1.50లక్షల విలువైన 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బిజయ్‌కుమార్ గంజాయిని చెన్నైకు తరలించి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఈబీ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు



విక్రేత అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తీసుకెళుతున్న వంశీ (27) అనే నిందితుడిని చిత్తూరు టూ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ప్రశాంత్‌నగర్ వద్ద ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా సంతపేటకు చెందిన వంశీ తన ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. అతడిని తనిఖీ చేయగా 190 కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయి. నిందితున్ని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.